సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



ఎర్రబస్సు నుంచి ఏసీబస్సు వరకు

ఎర్ర బస్సు నుంచి మొదలైన ఆర్టీసీ ప్రస్థానం ఏసీ బస్సు వరకు చేరింది. దశాబ్దాలుగా ఆటుపోట్లను తట్టుకుని ఆధునికత సంతరించుకుని అంచెలంచెలుగా ఎదిగింది. 8లో▸



మెండపల్లిలో ఫుడ్ పాయిజన్

ఇంద్రవెల్లి మండలం మెండపల్లి గ్రామంలో ఫుడ్ పాయిజన్‌తో 70మంది అస్వస్థతకు గురయ్యారు. బాధితులు ప్రస్తుతం పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
35.0/23.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. చాలా వరకు ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో

ఇంద్రవెల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు కృషి చేస్తున్నమని డీఐఈవో రవీందర్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సిలబస్, ఇతర సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతర మాట్లాడారు. జిల్లాలోని 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రస్తుతం సెకండియర్ చదువుతున్న 100 మంది విద్యార్థులను ఎంపిక చేసి జిల్లా కేంద్రంలో ఎంసెట్, నీట్ శిక్షణ ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఆయన వెంట ఆదిలాబాద్ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ భగవాన్లు, ఇంద్రవెల్లి కళాశాల ప్రిన్సిపాల్ ధన్‌రాజ్, అధ్యాపకులు తదితరులున్నారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి



ధర్నా చేస్తున్న నాయకులు, నిరుద్యోగులు

ఎదులాపురం: 20వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని, అలాగే నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, పీవైఎల్ జిల్లా నాయకుడు వంశీ మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో నిరుద్యోగులు మోసానికి గురయ్యారన్నారు. 13వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి, ప్రస్తుతం కేవలం ఐదు వేల పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఇందులో అనేక జిల్లాల్లో జీరో పోస్టులు ఉండడంతో వేలాది మంది నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి మెగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సాత్విక్ రెడ్డి, సందీప్, రాజేశ్, మహేశ్, వేణు, దేవ్ రావు, కార్తీక్, ప్రభాకర్, గంగన్న, విద్యాసాగర్, విజయ్, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

19వ రోజుకు 'మధ్యాహ్న' కార్మికుల సమ్మె



కార్మికులకు మద్దతు తెలుపుతున్న విలాస్

ఎదులాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె 19వ రోజుకు చేరింది. కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె శిబిరాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ సందర్శించి సమ్మెకు మద్దతు తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందులో నాయకులు కుంటాల రాములు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: బీసీ సంక్షేమ శాఖ, బీసీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ యాప్ ద్వారా డీఎస్సీ ఎస్జీటీ ఉచిత శిక్షణ అందజేయనున్నారు. ఈ మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఈ నెల 8 నుంచి 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 100 మందిని ఎంపిక చేసి శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్, స్టడీ సర్టిఫికెట్లు, డీఎస్సీ కోసం చేసిన దరఖాస్తును ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. బీసీలకు 75శాతం, ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 5 శాతం, ఈబీసీలకు 5 శాతం సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 08732 221280 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

- తలమడుగు మండలం సకినాపూర్ సమీపంలో ఇటీవల గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 350 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఎక్కడి నుంచి తీసుకొచ్చారని విచారించగా, తామే పంట పొలంలో సాగు చేస్తున్నట్లు తెలిపారు. పరిశీలించిన అధికారులు ఏడు మొక్కలను గుర్తించి ధ్వంసం చేశారు.



- ఉట్నూర్ మండలం నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పెందూర్‌గూడలో పక్కా సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు. ముగ్గురి చేలల్లో 450 మొక్కలు సాగవుతున్నట్లు నిర్ధారించారు. వాటిని ధ్వంసం చేసి కాల్చేశారు. వారిపై కేసులు నమోదు చేశారు.
- ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఖుర్షీద్‌నగర్ కాలనీకి చెందిన నజర్ అలీ అనే వ్యక్తిని పోలీసులు ఇటీవల పట్టుకున్నారు. గతంలో సైతం ఆయన గంజాయి విక్రయిస్తుండగా పట్టుబడగా అప్పటి తహసీల్దార్ ఇకపై విక్రయించవద్దని సూచించారు. అయినా మానలేదు. ఇటీవల మళ్లీ గంజాయి విక్రయిస్తూ పట్టుబడడంతో ప్రస్తుత ఆదిలాబాద్‌అర్బన్ తహసీల్దార్ రూ.లక్ష జరిమానా విధించారు.

గంజాయి గుప్పు!

మూడేళ్లుగా జిల్లాలో గంజాయి కేసులు, పట్టుబడిన సరుకు వివరాలు..

సంవత్సరం	కేసులు	సీజ్ చేసిన గంజాయి	విలువ
2021	13	75.500 కిలోలు, 500 మొక్కలు ధ్వంసం	రూ.6,49,600
2022	18	24.950 కిలోలు	రూ.2,24,800
2023 (ఇప్పటివరకు)	14	109.268కిలోలు	రూ.24,70,770

- మారుమూల పల్లెల్లో సాగు
- అంతర పంటగా అక్రమ దందా
- మత్తుకు చిత్తవుతున్న యువత
- కఠిన చర్యలపై యంత్రాంగం దృష్టి
- సాగు చేస్తే కేసుతో పాటు రైతుబంధు కట్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో గంజాయి గుప్పుమంటోంది. మారుమూల గ్రామాల్లో అంతర పంటగా గుట్టుగా సాగవుతోంది. అక్రమార్కులు కొంతమంది అమాయక రైతులకు డబ్బు ఆశ చూపి ప్రోత్సహిస్తున్నారు. దీనిని అరికట్టేందుకు పోలీసు శాఖ చర్యలు చేపట్టినప్పటికీ గుట్టచప్పుడు కాకుండా అక్రమ దందా కొనసాగుతూనే ఉంది. పత్తి, ఇతర పంటల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం గతేడాది ప్రత్యేక దృష్టి సారించింది. ఎక్సైజ్ అధికారులతో కలిసి గ్రామాల్లో తనిఖీలు చేపట్టింది. గంజాయి సాగు చేసే రైతులకు సంబంధించిన రైతుబంధు పథకాన్ని రద్దు చేయాలని ఆదేశించింది. అయితే అప్పట్లో పూర్తిస్థాయిలో చర్యలకు పూనుకోలేదు. ప్రస్తుతం గంజాయి విక్రయాలు పెరగడంతో వీటిపై మరోసారి దృష్టి సారించారు. అక్రమార్కులతో పాటు సాగు చేస్తున్న రైతులపై కేసులు నమోదు చేస్తున్నారు. అలాగే సంబంధిత రైతుల వివరాలు కలెక్టర్‌కు అందజేసి రైతుబంధు నిలిపివేయాలని కోరనున్నట్లు తెలుస్తోంది.

మత్తులో చిత్తు..

గంజాయి హుక్కాకు అలవాటుపడ్డ యువత వాటి మత్తులో చిత్తవుతున్నారు. జిల్లాలోని మారుమూల గ్రామాల్లో సాగైన గంజాయిని ఎండబెట్టిన అనంతరం కొంత మంది ప్యాకెట్ల రూపంలో తరలించి విక్రయిస్తున్నారు. ఉట్నూర్, తలమడుగు, భీంపూర్, బజార్‌హత్నూర్, బోథ్, నార్నూర్, గాదిగూడతో పాటు పలు మండలాల్లోని మారుమూల గ్రామాల్లో ఈ అక్రమ సాగు జోరందుకున్నట్లు తెలుస్తోంది. ఇలా సాగైన గంజాయిని పొరుగున ఉన్న మహారాష్ట్రతో పాటు హైదరాబాద్, తదితర ప్రాంతాల నుంచి వచ్చే వ్యక్తులకు ఇక్కడివారు రహస్యంగా విక్రయిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు.

ఆచరణలో అమలేది..

మాదక ద్రవ్యాలను మొగ్గలోనే తుంచేయాలని సీఎం కేసీఆర్ గతేడాది పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయా శాఖల అధికారులు అప్పట్లో క్షేత్రస్థాయికి వెళ్లి పంట పొలాల్లో సాగయ్యే గంజాయి మొక్కలను గుర్తించి ధ్వంసం చేశారు. కొన్నిరోజుల పాటు ఈ తనిఖీలు జరగగా, ఆ తర్వాత మరిచారు. ఇది అక్రమార్కులకు కలిసివచ్చింది. దీంతో వారు మరింతగా రెచ్చిపోయి ఈ దందాను కొనసాగిస్తున్నారు. గతేడాది పదుల సంఖ్యలో రైతులపై కేసులు నమోదు చేసినా రైతుబంధు నిలిపివేత చర్యలు మాత్రం తీసుకోనట్టుగా తెలిసింది.



ఉట్నూర్ మండలం నర్సాపూర్‌లో శుక్రవారం గుర్తించిన గంజాయి మొక్కలు

కోడ్‌తో విక్రయాలు..

జిల్లాలో గంజాయి విక్రయాలు రహస్యంగా సాగుతున్నాయి. ప్యాకెట్లలో, పేపర్లలో మడత పెట్టి యువతకు అంటగడుతున్నారు. వారికి ముందుగానే ఓ సీక్రెట్ కోడ్ చెబుతున్నారు. అలా చెప్పిన వారికి సంబంధిత వ్యక్తి గంజాయి ప్యాకెట్లను అందిస్తారు. ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్, ఖుర్షీద్‌నగర్, న్యూహౌసింగ్ బోర్డు, ఖానాపూర్, తదితర ప్రాంతాల్లో వీటిని ఎక్కువగా విక్రయిస్తున్నారు. దీంతోపాటు ఆయా హోటళ్లు, పాన్‌షాపులు, మైదాన ప్రాంతాల్లో కొంత మంది కూర్చొని వీటిని కస్టమర్లకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ముందస్తు సమాచారం మేరకు అప్పుడప్పుడు పోలీసులు దాడులు జరుపుతున్నారు. గంజాయికి అలవాటుపడ్డ వారిని గుర్తించి ఎక్కడినుంచి వస్తుంది.. ఎవరు విక్రయిస్తున్నారనే విషయాలు తెలుసుకుంటే ఈ ఆగడాలకు అడ్డుకట్టవేయవచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు. సంఘటనలు జరిగినప్పుడే అధికారులు అప్రమత్తం అవుతున్నారు. ఆ తర్వాత వాటిని పట్టించుకోకపోవడంతో ఈ దందా సాఫీగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఎవరినీ వదిలిపెట్టం



గంజాయి సాగు చేసిన, విక్రయాలు జరిపిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం. యువత గంజాయికి అలవాటు పడి మత్తులో విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి. రైతులు పంట పొలాల్లో గంజాయి మొక్కలు సాగు చేస్తే ప్రభుత్వ ఆదేశాల మేరకు కేసులు నమోదుతో పాటు రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. – డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ

అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి



పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ

జైనథ్: సరిహద్దు రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి డబ్బు, మద్యం, గంజాయి, ప్రజాకర్షణ వస్తువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై చెక్‌పోస్ట్ ఏర్పాటును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్, రవాణా, ఎక్సైజ్, అటవీ, రెవెన్యూ శాఖల సమన్వయంతో మూడు షిఫ్టుల్లో 24గంటల పాటు ప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున తెలంగాణలోకి వచ్చే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే అనుమతించాలన్నారు. ఆయన వెంట ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నరసింహారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హేమశ్రీ, జైనథ్ సీఐ నరేశ్‌కుమార్ ఉన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఎదులాపురం: పత్తి పంటలో గులాబీ రంగు పురుగు, కాయకుళ్లు తెగుళ్ల నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ శంకర్ నారాయణన్,డాక్టర్ మణివనన్‌అన్నారు. జిల్లా కేంద్రంలోని కృషివిజ్ఞాన కేంద్రంలో అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేస్తున్న పత్తి పంట క్షేత్రాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గులాబీ రంగు పురుగు, కాయకుళ్లు తెగుళ్ల నివారణకు లింగాకర్షక బుట్టలు, వేపనూనె వంటి వాటితో పాటు అవసరం మేరకు మాత్రమే పురుగు మందులు పిచికారీ చేయాలన్నారు. ఇందులో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్‌వై.ప్రవీణ్‌కుమార్,శాస్త్రవేత్తలు రాంప్రసాద్,రాజశేఖర్, గిమ్మ, బట్టిసావర్గాం, కజ్జర్ల, వాఘాపూర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

- జిల్లా జడ్జి డాక్టర్ వీఆర్ఆర్ వరప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వీఆర్ఆర్ వరప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా జడ్జి డాక్టర్ వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా కోర్టులో డిసెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై పోలీసులు అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఉన్న కేసుల వివరాలను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి జడ్జికి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ, రాజీమార్గం ద్వారా పరిష్కారం అయ్యే కేసులను కక్షిదారులతో మాట్లాడి పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. జిల్లాలో పది వేల కేసుల్లో దాదాపు 8 వేల వరకు డ్రంకెన్ డ్రైవ్ కేసులే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శివరాంప్రసాద్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, న్యాయమూర్తులు ప్రమీలజైన్, తులసి, దుర్గారాణి, మంజుల సూర్యవార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనలను అదుపు చేస్తే తప్పులు జరగవు

ఆలోచనలను అదుపు చేస్తే తప్పులు జరగవని జిల్లా జడ్జి వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవ అధికార సంస్థ కార్యాలయంలో ఐటీఐ విద్యార్థులకు శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు జిల్లా జడ్జి ముఖ్య అతిథిగా హాజరై పలు చట్టాలపై అవగాహన కల్పించారు. తప్పు చేయాలనే ఆలోచనలను అదుపు చేసి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. లక్ష్యాలను నిర్దేశించుకుంటూ ఉన్నతంగా రాణించాలన్నారు. లావాదేవీల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మొదటి అదనపు న్యాయమూర్తి డాక్టర్ శివరాం ప్రసాద్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంకండి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా అధికార యంత్రాంగం సంసిద్ధం కావాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులతో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. అనుసరించాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కోడ్ అమల్లోకి వచ్చి ముగిసే వరకు ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం విధులు నిర్వహించాలని సూచించారు. ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలపై క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. కోడ్ అమలైన 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, కార్పొరేషన్లు, పబ్లిక్ పార్కులు, బస్, రైల్వేస్టేషన్, పట్టణ, మండల, గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, పోస్టర్స్, హోర్డింగ్స్, వాల్ పెయింటింగ్స్ తొలగించాలని ఆదేశించారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, సరిహద్దుల్లోని చెక్ పోస్టుల్లో 24 గంటల పాటు పర్యవేక్షణ చేపట్టేందుకు సిబ్బందిని నియమించామన్నారు. అక్రమంగా మద్యం, నగదు, డ్రగ్స్, గంజాయి వంటివి తరలించకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, ఇన్‌చార్జి డీఆర్వో రమేశ్‌రాథోడ్, ఆర్డీవో స్రవంతి, పోలీసు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వాలు విఫలం'

ఎదులాపురం: ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు నంది రామయ్య, పీవైఎల్ రాష్ట్ర నాయకుడు కాశీనాథ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కుమురంభీమ్ భవన్‌లో శనివారం నిర్వహించిన పీవైఎల్ జిల్లా ప్రథమ మహాసభల్లో వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే 'ఉద్యోగాల జాతర' ఉంటుందన్న కేసీఆర్ మాటలు నీటిమూటలయ్యాయన్నారు. ఈ తొమ్మిదిన్నరేళ్లలో అరకొరగా ఇచ్చే నోటిఫికేషన్ల నిర్వహణలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గ్రూప్–1 రెండు సార్లు రద్దు కావడమే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా నాయకులు రాజన్న, జగన్‌సింగ్, పీవైఎల్ జిల్లా నాయకులు దుదేరావ్, వెంకటి, రామన్, దుర్గా పాల్గొన్నారు.

మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే..!



మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/చెన్నూర్: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని, హాజీపూర్ మండలంతోపాటు మంచిర్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం ఆయన మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం దొనబండలో ఏర్పాటు చేసిన సభావేదిక వద్ద రూ.80.50కోట్లతో నిర్మించనున్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు–పడ్తనపల్లి ఎత్తిపోతల పథకానికి, దొనబండలో రూ.1.90కోట్లతో నిర్మించనున్న 33/11కేవీ సబ్‌స్టేషన్ పనులకు, చెన్నూర్ పట్టణంలో రూ.10కోట్లతో నిర్మించిన 50 పడకల ఆస్పత్రి, రూ.55కోట్లతో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు, దోభీఘాట్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. చెన్నూర్ మండలం సుద్దాల వాగుపై రూ.15కోట్లతో నిర్మించిన వంతెన ప్రారంభించారు. దొనబండ సభ, చెన్నూర్ రోడ్డు షోలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా ఏర్పాటుతోపాటు 380 పడకల ఆస్పత్రి, గుడిపేటకు వైద్య కళాశాల తీసుకురావడంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు కృషి ఉందని తెలిపారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నేడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయని అన్నారు. దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని, ఈ క్రమంలో ఆగం కాకుండా సమగ్రంగా ఆలోచించి తగిన నిర్ణయంతో మరోసారి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా దివాకర్ రావును గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని, మూడోసారి సీఎంగా కేసీఆరే అని జోస్యం చెప్పారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా ఎలాంటి అభివృద్ధి, సంక్షేమానికి తావు లేకుండా పాలనను భ్రష్టు పట్టించి ప్రజలను నయవంచన చేసిందని విమర్శించారు. భస్మాసుర కాంగ్రెస్ పార్టీతో మోసపోవద్దని హితవు పలికారు. బీజేపీ రకరకాల కమిటీలు వేయడం మాని డిపాజిట్లు దక్కించుకునే కమిటీ వేసుకుని డిపాజిట్లు దక్కించుకోవాలని ఎద్దేవా చేశారు. చెన్నూర్‌లో అభివృద్ధి పరంపర కొనసాగాలంటే మరోసారి బాల్క సమన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రోడ్డు షోలో అన్నారు. ఈ కార్యక్రమాల్లో పెద్దపల్లి ఎంపీ వెంకటేష్‌నేత, ఎమ్మెల్సీ దండె విఠల్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య పాల్గొన్నారు. మంత్రి హరీశ్‌రావుకు ప్రజాప్రతినిధులతోపాటు మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్, రామగుండం సీపీ రెమారాజేశ్వరి, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

ప్రజలను మభ్యపెడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం

- ఎంపీ సోయం బాపూరావు
- రాష్ట్రంలో అధికారమే బీజేపీ లక్ష్యం
- అమిత్‌షా సభను విజయవంతం చేయాలి



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ సోయం, ప్రేమేందర్‌రెడ్డి, ఇతర నాయకులు

ఆదిలాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. ఈనెల 10న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి విచ్చేయనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డితో కలిసి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతుందన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితమైందని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే బీజేపీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకువచ్చేలా రాష్ట్ర, జాతీయ నాయకత్వం ప్రజలను చైతన్య పరుస్తుందని వివరించారు. ఇందులో భాగంగానే మంగళవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ జిల్లా కేంద్రానికి విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తంచేశారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో ఈనెల 10న మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభం కానున్న బహిరంగ సభను విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్న పట్టణంలోని స్థానిక డైట్ మైదానంలో పనులను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, బీజేపీ జిల్లా ఇన్‌చార్జి అల్జాపూర్ శ్రీనివాస్, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, అసెంబ్లీ ఇన్‌చార్జి బద్దం లింగారెడ్డి, నాయకులు ఆదినాథ్, జోగు రవి, జ్యోతిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, విజయ బోయర్, మయూర్ చంద్ర, లాలా మున్నా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్‌జేఎం ప్రచార ప్రముఖ్‌గా జిల్లా వాసి


సాయికిరణ్

ఆదిలాబాద్: స్వదేశీ జాగరణ్ మంచ్ సికింద్రాబాద్ విభాగం ప్రచార ప్రముఖ్‌గా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మాజీ సభ్యుడు కోటావార్ సాయికిరణ్ నియామకమయ్యారు. హైదరాబాదులోని సీసీఆర్టీలో నిర్వహించిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ స్వదేశీ జాగరణ్ మంచ్ ప్రాంత ప్రశిక్ష వర్గా కార్యక్రమంలో మంచ్ రాష్ట్ర కన్వీనర్ హరీష్‌బాబు ఆయన నియామకాన్ని ప్రకటించారు. అనంతరం సాయికిరణ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో విభాగ్ స్థాయి బాధ్యతను అప్పగించిన రాష్ట్ర సంఘటన మంత్రి రచ్చ శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్‌కు రాష్ట్ర పురస్కారం


పురస్కారం అందుకుంటున్న ఆర్‌ఎం

ఆదిలాబాద్: టీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రావణ మాసం చాలెంజ్ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్ రాష్ట్రవ్యాప్తంగా మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ చేతుల మీదుగా ఆదిలాబాద్ ఆర్‌ఎం సోలోమన్ రూ.50వేల నగదు పురస్కారంతో పాటు జ్ఞాపికను అందుకున్నారు. కార్యక్రమంలో ఈడీ వినోద్‌కుమార్, డిప్యూటీ ఆర్‌ఎం సురేశ్, డిపో మేనేజర్లు కల్పన, ప్రతిమారెడ్డి, శ్రీధర్ ఉన్నారు.

ఇద్దరి బైండోవర్

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి నేరస్తులను టుటౌన్ పోలీసులు శనివారం ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. నార్నూర్ మండలం బొప్పాపూర్‌కు చెందిన దూత్‌రాజ్ రాంకిషన్, ఆదిలాబాద్ పట్టణంలోని ధనగర్ గల్లీకి చెందిన షేక్ జావిద్ ఖురైషి ఇటీవల గంజాయి విక్రయిస్తూ పట్టుబట్టారు. దీంతో పోలీసులు వారిని బైండోవర్ చేయగా మరోసారి గంజాయి విక్రయిస్తే రూ.లక్ష జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రూ.30 చీరకు రూ.300 కూలి నష్టపోవాలా.?

ఎదులాపురం: రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న 30 రూపాయల బతుకమ్మ చీరల కోసం వచ్చే కూలీలు 300 రూపాయల కూలి డబ్బులను నష్టపోవాల్సి వస్తోందని భారత జాతీయ మహిళా సమైక్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళినిరెడ్డి అన్నారు. నాసిరకం బతుకమ్మ చీరల పంపిణీని నిరసిస్తూ ఆదిలాబాద్‌లో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఇందులో సంఘం నాయకురాళ్లు అమీనా ఖాన్, తార, పుష్ప పాల్గొన్నారు.

కుప్టి జాతీయ రహదారిపై కంటైనర్ బోల్తా

నేరడిగొండ: మండలంలోని కుప్టి జాతీయ రహదారిపై శనివారం కంటైనర్ బోల్తాపడింది. ఢిల్లీ నుంచి బెంగళూరు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో డ్రైవర్ క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి. కంటైనర్ రోడ్డుకు అడ్డంగా బోల్తాపడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో కంటైనర్‌ను పక్కకు తీశారు. దీంతో రాకపోకలు కొనసాగాయి.

ఎర్రబస్సు నుంచి ఏసీ బస్సు వరకు..



అల్బియన్ బస్సు
ఏసీ బస్సు

- అంచెలంచెలుగా ఆర్టీసీ పరిణామ క్రమం..
- ఆధునికత సంతరించుకున్న ప్రజా రవాణా సంస్థ
- ఆటుపోట్లను తట్టుకుని.. నిలదొక్కుకుని
- ఆదరణ పెంచుకుంటున్న ప్రగతి రథచక్రం
- ఉమ్మడి జిల్లాతో ప్రత్యేక అనుబంధం

ఆదిలాబాద్: ఒకప్పుడు తెలంగాణలో పక్క ఊరికి వెళ్లాలన్నా కాలినడకే శరణ్యం. స్వాతంత్ర్యానికి పూర్వం కేవలం ధనికులు, ఎగువ మధ్యతరగతి కుటుంబాలకు మాత్రమే ప్రైవేటు వాహనాలు ఉండడంతో దూరప్రాంతాలకు ప్రయాణం చేసేవారు. 1932లో నిజాం ప్రభువు మీర్ ఉస్మాన్ అలీఖాన్ హైదరాబాద్ రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థను ప్రారంభించడంతో ప్రజలకు రవాణా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ విధంగా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కోట్లలో ప్రయాణికులను గమ్యస్థానాలకి చేరుస్తూ విడదీయలేని అనుబంధాన్ని ఏర్పర్చుకుంది.

ఇదీ చరిత్ర...

నైజాం పాలిత హైదరాబాద్ రాష్ట్రంలో 1932 వరకు నిజాం రైల్వే రవాణా సంస్థ మాత్రమే ఉండేది. కేవలం సంపన్న వర్గాలకు మాత్రమే ప్రైవేట్ వాహనాల ద్వారా రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండేవి. అయితే సంస్థాన చివరి పాలకుడైన ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ తల్లి జహీరున్నీసా బేగం కోరిక మేరకు ఆయన హైదరాబాద్ రాష్ట్రంలో బస్సు రవాణా వ్యవస్థను ప్రారంభించారు. నైజాం రాష్ట్ర రైల్వే, రోడ్డు రవాణా సంస్థ పేరిట 1932లో బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దేశంలో బస్సుల తయారీ రంగం అంతగా అభివృద్ధి చెందని పరిస్థితుల్లో అప్పటి యునైటెడ్ కింగ్‌డం (ఇంగ్లాండ్) లండన్ నుంచి 27 బస్సులను ప్రత్యేకంగా ముంబై వరకు ఓడల్లో తీసుకువచ్చారు. అక్కడి నుంచి రహదారి మార్గంలో బస్సులు హైదరాబాద్ చేరుకున్నాయి. తల్లి స్మృత్యర్థం మీర్ ఉస్మాన్ అలీఖాన్ బస్సుల నంబర్ ప్లేట్లలో తన తల్లిపేరు జెడ్ అక్షరం వచ్చేలా రిజిస్ట్రేషన్ చేయించారు. రూ.3.71 లక్షల నిధులతో ప్రారంభమైన సంస్థ నేడు కోట్లలో ఆదాయం ఆర్జిస్తోంది.

ఉమ్మడి జిల్లా వివరాలు

	నాడు	నేడు
డిపోలు	01	06
బస్సులు	07	612

ఆదిలాబాద్ రీజియన్ ముఖచిత్రం

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 1975లో మంచిర్యాల డిపో, 1980లో ఆదిలాబాద్ డిపో, 1991లో భైంసా, 1996లో ఉట్నూర్ డిపోలను ఏర్పాటు చేశారు. 1994లో రీజియన్ ఏర్పాటైంది.

ఎర్రబస్సు నుంచి..

1932లో 27 ఎర్రబస్సులతో ప్రారంభమైన ఆర్టీసీ ప్రస్థానం దినదినాభివృద్ధి చెందుతోంది. ఆధునిక విజ్ఞానం వేగంగా పెరగడంతో బస్సు పరిమాణం, కెపాసిటీ, వేగం సైతం పెరిగాయి. ఆర్టీసీ బస్సులకు గతంలో సెల్ఫ్‌స్టార్ట్ విధానం లేకపోవడంతో క్రాంకింగ్ విధానం ద్వారా తిప్పి బస్సును ప్రారంభించేవారు. అప్పట్లో బస్సు గంటకు 10 కిలోమీటర్ల వేగంతో నడిచేది. 100 కిలోమీటర్ల దూరం వెళ్లడానికి సుమారు 10 గంటల సమయం పట్టేది. ఈ బస్సులు పెట్రోల్‌తో నడిచేవి. రెండో ప్రపంచ యుద్ధకాలంలో చమురు కొరత సమస్య ఏర్పడడంతో కొన్ని రోజులపాటు బొగ్గు వినియోగించి ఆవిరి ద్వారా బస్సులు నడిపారు. ఆతర్వాత డీజిల్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఎలక్ట్రిక్ బస్సులను సైతం సంస్థ ప్రవేశపెడుతోంది. మొదటితరం బస్సుల్లో డ్రైవర్, కండక్టర్‌తో పాటు 17 మంది మాత్రమే ప్రయాణించే వెసులుబాటు ఉండేది. నేటి బస్సులు గంటకు వందల కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తుండగా సీట్ల కెపాసిటీ సైతం పెరిగింది. బస్సులను ఆధునీకరించడంతో విలాసవంతంగా ఎయిర్ కండిషన్డ్ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణం చేయగలుగుతున్నారు.

రాష్ట్రంలోనే తొలి డిపో..

1932లో రాష్ట్ర వ్యాప్తంగా 16 డిపోలను నిర్మించారు. అసఫ్‌జాహీ వంశం పేరు మీదుగా ఏర్పడిన ఆసిఫాబాద్ జిల్లాపై ఉన్న మమకారంతో జిల్లా కేంద్రంలో డిపో నిర్మించి 7 బస్సులను కేటాయించారు. ఆసిఫాబాద్ నుంచి మహారాష్ట్రలోని రాజురా, మంచిర్యాల, రెబ్బెన రూట్లలో బస్సులు నడిపించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే ఇది తొలి డిపో కావడం విశేషం. ఈ డిపో 92 వసంతాలు పూర్తి చేసుకుంది.

నిర్మల్‌కూ ప్రత్యేకత...

నిర్మల్ జిల్లా కేంద్రంలో 1934 నవంబర్ 5న ఆర్టీసీ డిపో ప్రారంభమైంది. కేవలం ఐదు బస్సులు కేటాయించగా 15 నుంచి 20 మంది సిబ్బంది విధులు నిర్వర్తించేవారు. నైజాం కాలంలో నడిపిన 19 సీటర్ అల్బియన్ బస్సు నిర్మల్ డిపో నుంచి నాందేడ్ రూట్‌లో నడిపేవారు.

టిక్కెట్ టు డిజిటల్ పేమెంట్స్...

బస్సులో ప్రయాణించాలంటే టిక్కెట్ ఉండాల్సిందే. గతంలో కండక్టర్లు ప్రత్యేక ప్రత్యేకంగా ముద్రించిన టిక్కెట్లపై పంచింగ్ వేసి ఇచ్చేవారు. స్టేజీని బట్టి ప్రయాణికుల నుంచి డబ్బులు తీసుకొని పంచింగ్ చేసి టిక్కెట్లు ఇచ్చేవారు. ఎన్ని టిక్కెట్లు ఇచ్చారనే లెక్కలను ట్రిప్ షీట్‌లో నమోదు చేసేవారు. ఈ విషయంలో కండక్టర్లు మానసిక ఒత్తిడికి గురయ్యేవారు. పలు సందర్భాల్లో ఈ చిన్న విషయం ఆదాయంపై సైతం ప్రభావం చూపింది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రానిక్ టిక్కెట్ మెషిన్లు అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం టిమ్స్ (టికెట్ ఇష్యూయింగ్ మెషీన్)తో పాటు డిజిటల్ పేమెంట్లు సైతం ప్రారంభించారు.

కంది శ్రీనివాసరెడ్డికి టికెట్ ఇవ్వొద్దు


గాంధీభవన్ ఎదుట ధర్నాలో కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: ఆర్‌ఎస్‌ఎస్ నుంచి వచ్చిన కంది శ్రీని వాసరెడ్డికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వొద్దని డిమాండ్ చేస్తూ పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఎదుట ధర్నా నిర్వహించా రు. నియోజకవర్గం నుంచి ప్రత్యేక వాహనాల్లో హై దరాబాద్ తరలివెళ్లిన నాయకులు అక్కడ శ్రీనివాసరెడ్డికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడు తూ పార్టీ కోసం పనిచేసిన వాళ్లకే టికెట్ కేటాయించాలని, కష్టపడిన వారిని గెలిపించుకుంటామన్నా రు. పదిహేన్నేళ్లుగా అధికారం లేకపోయినా పార్టీ కోసం పనిచేస్తూ జెండా మోసిన వాళ్లకే టికెట్ కేటా యించాలన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నుంచి వచ్చి న కంది శ్రీనివాసరెడ్డికి టికెట్ కేటాయించవద్దని డిమాండ్ చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఎన్నో సేవలు అందించిన డీసీసీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్, పార్టీ సీనియర్ నాయకురాలు గతంలో పోటీచేసిన గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డిల్లో ఎవరికిచ్చిన తాము కష్టపడి పనిచేస్తామన్నారు. నాయకులు జి. నగేష్, ఖలీమ్, తుకారాం పాల్గొన్నారు.

సీసీఐ పునః ప్రారంభానికి ప్రకటన చేయాలి

ఎదులాపురం: సభ నిమిత్తం ఈ నెల 10న జిల్లా కేంద్రానికి రానున్న కేంద్ర మంత్రి అమిత్ షా సభలో స్థానిక సీసీఐ పునః ప్రారంభంపై ప్రకటన చేయాలని సీసీఐ సాధన సమితి జిల్లా కన్వీనర్ దర్శనాల మల్లేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో శనివారం ఏర్పాటు చేసిన సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీసీఐ పునః ప్రారంభం అనేది జిల్లా ప్రజల చిరకాల వాంఛ అని గుర్తు చేశారు. అందుకోసం పార్టీలకు అతీతంగా సీసీఐ సాధన కమిటీ రెండేళ్లుగా పోరాడుతుందని గుర్తు చేశారు. కేంద్ర మంత్రి అమిత్‌షాను కలసి వినతిపత్రం ఇవ్వడానికి అవకాశం కల్పించాలని ఎంపీ సోయం బాపూరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్‌ను సమితి కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. ఈ సమావేశంలో సమితి కన్వీనర్ దర్శనాల మల్లేష్, కో కన్వీనర్ విజ్జగిరి నారాయణ, నాయకులు కొండా రమేష్, అరవింద్, నందిరామయ్య, బండి దత్తాత్రి, ఈశ్వర్ దాస్, రాజన్న పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

- వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు, జడ్జి శామ్యూల్


మాట్లాడుతున్న వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు, జడ్జి శామ్యూల్

ఎదులాపురం: ఉమ్మడి జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వినియోగదారుల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు, జడ్జి శామ్యూల్, జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఇందులో ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ అనిత, వినియోగదారుల సహాయ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర లాల్ చౌరాసియా, ఉపాధ్యక్షుడు సంపత్ కుమార్, జిల్లా కన్జుమర్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షుడు ఆంజనేయులు, ఉమ్మడి జిల్లా వినియోగదారుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు మోహన్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ పాల్గొన్నారు.

గిరి రైతులు అభివృద్ధి చెందాలి

- ట్రైయినీ కలెక్టర్ వికాస్ మెహత


ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ట్రైయినీ కలెక్టర్

తలమడుగు: గిరిజన రైతులు ఐటీడీఏ నుంచి అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ట్రైయినీ కలెక్టర్ వికాస్ మెహత అన్నారు. మండలంలోని పల్సి(బి), పల్సి(తండా), పల్సి(కె), కోసాయి, దేహగామ గ్రామాల్లో గిరిజన రైతుల పంట పొలాల్లో గిరివికాసంలో త్రీ ఫేస్ సౌకర్యం కల్పించడంతో శనివారం ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గ్రామానికి వచ్చిన ట్రైయినీ కలెక్టర్‌ను, జెడ్పీటీసీ గణేష్‌రెడ్డి, ఎంపీటీసీలను గ్రామస్తులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డీఈ ప్రభాకర్, ఏఈలు, శ్రీనివాస్, సతీష్, సర్పంచులు పాయల్ అంగూర్, సరోజా, గోపాల్, సుభాష్, ఎంపీటీసీలు హనుమంతు, వెంకన్న యాదవ్, రమేష్ రెడ్డి, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత


పట్టుకున్న గుడుంబాతో పోలీసులు

కుంటాల: మండలంలోని దౌనెల్లి పంచాయతీ పరిధిలోని తండాలో శనివారం సాయంత్రం గుడుంబా స్థావరంపై పోలీసులు దాడి చేశా రు. ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. గుడుంబా తయారు చేస్తున్న రాథోడ్ శ్యామ్‌రావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

గుడుంబా పట్టివేత

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు తయారు చేస్తున్న గుడుంబా స్థావరంపై శనివారం దాడులు చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. ఈ సందర్భంగా రూ.9వేల విలువైన 30లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన మంచికంటి గంగన్నపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపా రు. పొన్కల్‌లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గుడుంబా విక్రయించేందుకు వెళ్తు న్న గంగన్నను పట్టుకుని కేసు నమోదు చేశా రు. గుడుంబాను తయారు చేసినా, విక్రయించినా వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

మెండపల్లిలో ఫుడ్ పాయిజన్

- 70మందికి అస్వస్థత...ఆస్పత్రికి తరలింపు
- గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు


అస్వస్థతకు గురైన వారిని పరీక్షిస్తున్న వైద్యుడు శ్రీకాంత్

ఇంద్రవెల్లి: మండలంలోని మెండపల్లి గ్రామంలో ఫుడ్ పాయిజన్‌తో 70మంది అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామస్తుల వివరాల ప్రకారం... ఈ నెల 5న గురువారం సాయంత్రం మెండపల్లి గ్రామానికి చెందిన ముండే బలిరామ్ ఇంట్లో పెద్దల పేర్లతో పితృపక్ష పూజలు నిర్వహించి అన్నం, పప్పుతో పాటు బూరెలతో భోజనం ఏర్పాటు చేశాడు. సాయంత్రం ఐదు గంటలలోగా భోజనం చేసిన వారికి ఎలాంటి సమస్య రాలేదు. సాయంత్రం భోజనం చేసిన వారిలో కొందరు శుక్రవారం సాయంత్రం వాంతులు, విరేచనలతో అస్వస్థతకు గురికాగా మండల కేంద్రంతో పాటు జిల్లా కేంద్రంలోని పలు ఆస్పత్రులకు తరలించారు. శనివారం తెల్లవారుజాము నుంచి గ్రామంలో సుమారు 70మంది అస్వస్థతకు గురయ్యారు. ఇందులో కనరే రాదాబాయి(40), ముండే సుగందా(45), సింధుబాయి(50), బలిరామ్(50), అంజలి(50), యేమునబాయి(45), మానే సునిత(35), ఉర్మిళ(45), ముండే జ్యోతి(17) తీవ్రంగా అస్వస్థతకు గురికాగా 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కాడే డిగంభార్(60), కాడే సాక్షి(14), కాడే అనిత(36), కాడే కార్తీక్(26), కాడే నానేశ్వర్(30), శిరశాట్ ఉర్మిళ(60), ముండే ఐశ్వర్యం(18), రాములు(50) అంబులెన్స్‌ల ద్వారా మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే పలువురు మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు మెండపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అయితే ముండే బలిరామ్ ఇంటి బోరు బావి నీరు తాగి అస్వస్థతకు గురైన పలువురి మూత్రం శాంపిల్ సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు వైద్యుడు శ్రీకాంత్ తెలిపారు. అదనపు వైద్యాధికారి విజయ్‌కుమార్ గ్రామాన్ని సందర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.


అంబులెన్స్‌లో బాధితులను ఆస్పత్రికి తరలింపు


మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబీకులు

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి


ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న బొజ్జుపటేల్

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండలంలోని మెండపల్లిలో అస్వస్థతకు గురైన బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జుపటేల్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. విషయం తెలుసుకుని వారు శనివారం వేర్వేరుగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి బాధితుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం మెండపల్లి గ్రామానికి సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. ఇందులో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పిచ్చికుక్కల దాడిలో 10మందికి గాయాలు


కుక్కకాటుకు గురైన దీలిప్

బేల: మండల కేంద్రంలోని మార్కెట్ కూడలిలో శనివారం సాయంత్రం రెండు పిచ్చి కుక్కలు విజృంభించాయి. మార్కెట్ కూడలితో పాటు కుమురంభీం చౌరస్తాలో జాతీయ రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు, ఆయా పనుల కోసం వచ్చిన 10మందిపై దాడి చేసి గాయపరిచాయి. దీంతో బాధితులు వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీకాలు తీసుకున్నారు. తీవ్ర గాయాలపాలైన వారిలో బేలకు చెందిన దిలీప్, దహెగాంకు చెందిన ఇర్ఫాన్‌తో పాటు మరో ఎనిమిది మంది ఉన్నారు.

కేసుల విచారణలో న్యాయవాదుల పాత్ర కీలకం

నిర్మల్‌టౌన్: క్రిమినల్ కేసుల విచారణలో న్యాయవాదుల పాత్ర కీలకమని తెలంగాణ హైకోర్టు జడ్జిలు జస్టిస్ కె.లక్ష్మణ్, సూరేపల్లి నంద అన్నారు. ఏబీవీపీ 31వ ఫార్మేషన్ డే సందర్భంగా న్యాయవాది పరిషత్ నిర్మల్ యూనిట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోశనివారం క్రిమినల్ ట్రయల్ లాయర్ పర్స్పెక్టివ్‌పై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్రిమినల్ కేసులను ట్రయల్స్‌లో ఎలా విచారించాలో పలు ఉదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ న్యాయవాది పరిషత్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ సునీల్, నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ నరేందర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్

సాయిబాబా ఆలయంలో పూజలు..

పట్టణ శివారులోని శ్రీ గండిరామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో శనివారం హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టు చైర్మన్ లక్కడి జగన్మోహన్ రెడ్డి స్వాగతం పలికారు. పూజారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.